క్లుప్తంగా

స్వర్ణ కిరీటానికి విరాళాలు



అర్చకునికి బంగారం అందజేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక డీసీసీబీ కాలనీలో ఉన్న భూ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కొలువైన వేంకటేశ్వర స్వామివారికి బంగారు కిరీటం చేయించే నిమిత్తం చాప బలరాం, మోక్షలక్ష్మీ దంపతులు పావుతులం బంగారం, హనుమంతు ఆనందరావు, రోజా దంపతులు రూ.25 వేల నగదు విరాళంగా శనివారం అందించినట్లు అర్చకులు గోపాలాచార్యులు తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

ఎచ్చెర్ల: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు లాభాలు వస్తాయని ప్రకృతి వ్యవసాయ సమన్వయకర్త సూర్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రీయ ఎరువులు వినియోగించడం వలన ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పండించవచ్చన్నారు. దీనివలన తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. మండలంలోని కేశవరావుపేట, ధర్మవరం, పొన్నాడ, బొంతలకోడూరు గ్రామాల్లో ఎక్కువగా సేంద్రీయ సాగు చేపడుతున్నారని తెలిపారు.

భూసార పరీక్షలతో మేలు



భూసార ఫలితాల పత్రాలు అందిస్తున్న వ్యవసాయ అధికారులు

రణస్థలం: భూసార పరీక్షలతో రైతులకు మేలు జరుగుతుందని భూసార పరీక్షల ల్యాబ్ ఏడీఏ సత్యవతి తెలిపారు. మండలంలోని సంచాం పంచాయతీలో భూసార పరీక్షల ఫలితాలు ఆధారంగా పంటల్లో ఎరువులు వాడకం అనే అంశంపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకొని, ఫలితాల ఆధారంగా ఎరువులు వేసుకోవాలని సూచించారు. ఎఫ్‌టీసీ వ్యవసాయ అధికారి సూర్యకుమారి మాట్లాడుతూ ఎరువుల వినియోగం అవసరం మేరకు ఉండేలా, పశువుల ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో విద్యనందించాలి



కార్యకర్తలకు సూచనలు చేస్తున్న అధికారులు

జి.సిగడాం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనందించాలని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎస్.సుధాకర్, ఎంఈవో-2 ముళ్ల శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మోడల్ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 5 ఏళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీల్లో బొమ్మలు, ఆటపాటలతో కూడిన జ్ఞానాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పొగిరి వెంకటేష్, అగూరు మురళీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి, డీఆర్పీలు పిట్టా అప్పారావు, కిల్లారి వెంకటరమణ, శ్రీరామదత్త తదితరులు పాల్గొన్నారు.

హరినామ సంకీర్తన



శ్రీకాకుళం కల్చరల్: నగర సంకీర్తన చేపడుతున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కలెక్టర్ బంగ్లా వద్దనున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు నగర వీధుల్లో హరినామ సంకీర్తనలు శనివారం నిర్వహించారు. ఆలయ అర్చకులు వంశీకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామావళి చేపట్టారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని లింగాలవలస గ్రామంలో శనివారం నగర సంకీర్తన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని భజన బృందం సభ్యులు, మహిళా భక్తులు వేకువజామున రామాలయంలో ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం వెంకటాపురం గ్రామం వరకు సంకీర్తనలు చేసుకుంటూ వెళ్లారు.

లింకు రోడ్లకు.. మోక్షమెన్నడో..?

- శంకుస్థాపనలు చేసి నిర్మాణాలు నిలుపుదల
- నగం రోడ్డు నిర్మించి మిగిలిన పనులు గాలికి
- ప్రధాన రహదారులపైనే పదేపదే మరమ్మతులు



గుజరాతీపేట రోడ్డు



తిలక్‌నగర్ మట్టిరోడ్డు

శ్రీకాకుళం:

నగరంలోని ప్రధాన రహదారుల నుంచి ఉన్న లింకు రోడ్ల నిర్మాణాలకు మోక్షమెన్నడు కలుగుతుందోనని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రధాన రహదారులపైనే పదేపదే మరమ్మతులు, పునః నిర్మాణాలు చేపట్టేందుకు ప్రాధాన్యమిస్తున్నారని వాపోతున్నారు. లింకు రోడ్లుపై దృష్టి సారించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో శంకుస్థాపనలు చేసి నిర్మాణాలు గాలికొదిలేశారు. దీనికి ఉదాహరణగా గుజరాతీపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ వెనుకన ఉన్న వీధిని చెప్పుకోవచ్చు. పట్టణంలోని మరికొన్ని చోట్ల రోడ్డును సగం వరకు నిర్మించి మిగిలిన భాగాన్ని నిర్మించకుండా వదిలేశారు. డీసీసీ కాలనీ సమీపంలో తిలక్ నగర్‌కు అనుసంధానం చేసే రోడ్డు దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఈ రోడ్డును సగం వరకు నిర్మించి చివరలో 200 మీటర్ల నిర్మాణాన్ని కొన్ని నెలలుగా వదిలేశారు. ఇటీవల నగర సుందరీకరణ పేరుతో రూ.3 కోట్లకు పైగా కార్పొరేషన్ సాధారణ నిధులు నుంచి ఖర్చు చేశారు. వాటిలో కొంత నిధులను ఇప్పటివరకు నిర్మాణం జరగని రోడ్లకోసం ఖర్చు చేసి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. బాగున్న వాటిపైనే నిర్మాణాలు చేపట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి నగరంలో ఎలాంటి అభివృద్ధి లేని లింకు రోడ్లు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

రెండుసార్లు శంకుస్థాపన



గుజరాతీపేటలో మేము నివాసముంటున్న ప్రాంతంలో రోడ్డు నిర్మాణానికి రెండుసార్లు శంకుస్థాపన చేశారు. నిర్మాణానికి సంబంధించిన పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. దీంతో రాకపోకలకు అనేక ఇబ్బందులు పడుతున్నాం.

– మొదలవలస రాఘవ, గుజరాతీపేట, శ్రీకాకుళం

అసంపూర్తి నిర్మాణాలు



నగరంలోని 6వ డివిజన్ పరిధిలో తిలక్ నగర్‌కు కలిపే రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. కార్పొరేషన్ అధికారులకు అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

– విజయకృష్ణ, తిలక్‌నగర్, శ్రీకాకుళం

దశల వారీగా నిర్మాణాలు



దశలవారీగా రోడ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు వస్తే పనులు చేపడతాం. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రోడ్లకు మోక్షం కలిగించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

– ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం

ముమ్మర తనిఖీలు



గంజాయి, గుట్కా వంటి పదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని జేఆర్‌పురం ఏఎస్‌ఐ డి.రమణమూర్తి హెచ్చరించారు. రణస్థలం మండలంలోని కమ్మసిగడాం, జేఆర్‌పురం, కోష్ట, పైడిభీమవరం తదితర గ్రామాల్లో పోలీసు జాగిలాలతో శనివారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో దుకాణాల్లో విస్తృతంగా సోదాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం యూబీ పరిశ్రమలో కార్మికులకు ఐసీపీఎస్ అధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు.

– రణస్థలం

కోడ్ వర్తించదా..?



ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ నాయకుల విగ్రహాలకు అధికారులు ముసుగులు వేశారు. అయితే జాతీయ రహదారికి అనుకొని శ్రీకాకుళం నగరంలోకి ప్రవేశించే సింహద్వారం సమీపంలో ఉన్న కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడి విగ్రహానికి ముసుగు లేదు. వెనుక ఉన్న విగ్రహానికి మాత్రం ముసుగు ఉంది. దీంతో ఎన్నికలు నిబంధనలు పక్కాగా అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

చికెన్ షాపులు వెలవెల



బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ షాపులు వెలవెలబోతున్నాయి. గత కొన్ని రోజులుగా వినియోగం భారీగా తగ్గడంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మన ప్రాంతంలో ఎటువంటి బర్డ్ ఫ్లూ కేసులు లేకపోవడం, ఉడికించి తినడం వలన సమస్య లేదని వైద్యులు చెబుతున్నా అమ్మకాలు మాత్రం పుంజుకోవడం లేదు. అయితే కొన్ని రోజుల్లో చికెన్ అమ్మకాలు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

మహా కుంభాభిషేకానికి తరలిరండి



స్థల పరిశీలన చేస్తున్న మున్సిపల్ అధికారులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఉమారుద్ర కోటేశ్వర ఆలయానికి అనుకుని ఉన్న నాగావళి నదీతీరాన మహా కుంభాభిషేకానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. మహా కుంభమేళా ముగింపును పురస్కరించుకుని అదే రీతిలో ఇక్కడ కూడా భక్తిభావం ఉట్టిపడేలా స్థానికంగా చేపడుతున్న మహత్తర కార్యక్రమం ఇది. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ నేతృత్వంలో ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. ఈనెల 26వ తేదీన మహా శివరాత్రి పురస్కరించుకుని నాగావళి నదీగర్భంలో విశేష కార్యక్రమాలు జరుగుతాయన్నారు. దీనికి సంబంధించిన శ్రీకాకుళం నగర కమిషనర్ ప్రసాదరావుతో కలిసి స్థల పరిశీలన, ఏర్పాట్లను శనివారం పర్యవేక్షించారు. ఆధ్యాత్మిక గురువు భాస్కరభట్ల శ్రీరామశర్మ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు, సామూహిక అభిషేకాలు, అర్చనలు జరుగుతాయన్నారు. 26వ తేదీ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, అనంతరం రాత్రి పదిన్నర గంటలకు ప్రత్యేక అర్చన, అభిషేకాలు, రాత్రి 12.12 గంటలకు మహా లింగోద్భవం ఉంటుందని తెలిపారు. గురువారం తెల్లవారుజామున బ్రహ్మ కాలార్చన, మహా పూర్ణాహుతి, మహా కుంభమేళ ముగింపు సభ, ప్రసాద వితరణ ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ పి.సుధీర్ కుమార్, మున్సిపల్ సిబ్బంది, యోగా సాధకులు తంగి స్వాతి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా చైతన్యంతోనే దేశాభివృద్ధి



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజా చైతన్యంతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర కోర్ కమిటీ సమన్వయకర్తలు పుట్టా సురేంద్ర బాబు, డా.వెన్నపూస బ్రహ్మారెడ్డిలు అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన శ్రీకాకుళం నగరంలోని కెమిస్ట్ డ్రగ్గిస్ట్ భవనంలో శనివారం ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక కార్యాచరణపై సమీక్షించి భవిష్యత్ ప్రణాళికను తీర్మానించారు. గ్రామ, వార్డు సభలతోనే అభివృద్ధి సాధ్యమని, వీటిపై పెద్ద ఎత్తున ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమాచార హక్కు చట్టం పటిష్టవంతంగా అమలు చేసేందుకు కృషి చేయాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించేందుకుగాను కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. రాజ్యాంగంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కలిగించేందుకు యువతను చైతన్యపరచాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొతారపు ప్రసాద్, కోశాధికారి జె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు రహీం, కోర్ కమిటీ సభ్యులు లోకనాథ్, కోట శివప్రసాద్ పొరేపల్లి సత్యనారాయణ, ప్రసంగి ఆదినారాయణ, వేమగిరి సన్యాసిరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా జనగణన జరిపించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: షెడ్యూల్డ్ కులాల జనగణన పారదర్శకంగా జరిపించాలని దళిత సంఘాల జేఏసీ నేతలు తైక్వాండో శ్రీను, డా.కంఠ వేణులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో అంబేడ్కర్ కాంస్య విగ్రహ నిర్మాణ పనులను ఏప్రిల్ 14లోపు పూర్తయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్సాహంగా ఎన్‌వైకే క్రీడా పోటీలు



ఉత్సాహంగా సాగుతున్న వాలీబాల్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని కోడి రామ్మూర్తి క్రీడా ప్రాంగణంలో జిల్లా నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయి క్రీడాపోటీలను నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, బాడ్మింటన్, 100 మీటర్ల రన్నింగ్ పోటీలు జరిగాయి. కనీస సమాచారం లేకపోవడంతో ఆశించిన స్థాయిలో క్రీడాకారులు హాజరుకాలేదు. విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అంతకుముందు ఈ పోటీలను సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు, నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో డాక్టర్ కె.శ్రీధర్‌రావు, నెహ్రూ యువకేంద్ర ఏవో డి.శ్రీనివాసరావు, గుజ్జల ఉమామహేశ్వరరావు, రొతు సుమతీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు ప్రత్యేక డ్రైవ్



చెత్త సంపద కేంద్రాలను పరిశీలిస్తున్న డీపీవో భారతీ సౌజన్య

అరసవల్లి: జిల్లాలో ప్రతీ ఇంటి నుంచి 100 శాతం చెత్త సేకరణ చేపట్టే దిశగా శని, ఆదివారాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య తెలియజేశారు. ఈ మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను శనివారం ఆమె పరిశీలించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న డ్రైవ్‌లో ఉదయం 6 గంటల నుంచి అధికారులంతా విధులకు హాజరై చెత్త సేకరణ వందశాతం పూర్తి చేయించాలని ఆదేశించారు. అలాగే పంచాయతీల్లో ఎక్కడా చెత్త కుప్పలు లేకుండా చూడాలన్నారు. రెండు రోజుల డ్రైవ్ వివరాలను అధికారులు ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

'గాదె'ను గెలిపించండి



గాదెను గెలిపించాలని కోరుతున్న ఐక్యవేదిక నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడుని గెలిపించాలని సోషల్ జస్టిస్ ఫోరం, బీసీ ఐక్యవేదిక, కాపు ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ యర్రాకుల తులసీరామ్‌యాదవ్, రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ జంగాల సింగరయ్య యాదవ్, రాష్ట్ర కన్వీనర్ దానా గౌడ్‌లు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో సమావేశం శనివారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం బీసీలందరికీ తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. ఈ విషయాన్ని బీసీలంతా గమనించి, టీడీపీ అభ్యర్థిని ఓడించాలని కోరారు

15 మంది డ్రైవింగ్ లైసెన్సులు రద్దు

శ్రీకాకుళం క్రైమ్: మద్యం తాగి వాహనాలు నడిపే 15 మంది ద్విచక్రవాహనదారుల లైసెన్సులు రద్దు చేస్తూ శ్రీకాకుళం ఆర్టీవో కార్యాలయానికి ప్రతిపాదనలు పంపామని ట్రాఫిక్ సీఐ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవలే 24 మంది వాహనదారుల లైసెన్సులు రద్దు చేసిన సంగతి తెలిసిందే. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి లైసెన్సులు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కోర్టులో చలానాలు సైతం కట్టించామన్నారు.

ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా

జి.సిగడాం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్‌రాజా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా పలు రికార్డులను పరిశీలించారు. చెత్త సంపద కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతోపాటు ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు తదితరులు ఉన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: క్యాన్సర్‌పై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్త డాక్టర్ ఎస్‌ఏ రాజు బగిడి సూచించారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం సూక్ష్మజీవి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ లలిత ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అధ్యక్షతన ఒకరోజు అతిథి ఉపన్యాసాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ చికిత్సలో నాన్ కోడింగ్ ఆర్ఎన్ఏల పాత్ర అనే అంశంపై డిగ్రీ, పీజీ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్ మహమ్మారి విస్తరిస్తోందని.. మహిళలు ఆదిలోనే గుర్తించి అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శంకర్‌నారాయణ, ఎస్.పద్మావతి, సీహెచ్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం



జేఆర్‌పురం హైస్కూల్‌లో మాట్లాడుతున్న విజయ గౌరి

రణస్థలం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేలా కార్యాచరణ రూపొందిస్తామని ఉత్తరాంధ్ర పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కోరెడ్ల విజయగౌరి తెలిపారు. మండల కేంద్రంలోని జే.ఆర్.పురం హైస్కూల్లో శనివారం ఆమె ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జి.సిగడాం: ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ పాఠశాలల్లో ఉన్న ఓటర్లతో శనివారం ఆమె మాట్లాడారు. ఆమెతో పాటు డాక్టర్ అన్నా శామ్యేల్ లెంక, పీఎస్ నర్సింహమూర్తి, రెడ్డి మోహన్‌రావు తదితరుల ఉన్నారు.

కుక్కల దాడిలో 8 మందికి గాయాలు

జి.సిగడాం: మండలంలోని చెట్టుపొదిలాం గ్రామంలో గత మూడు రోజుల్లో 8 మంది కుక్కల దాడిలో గాయాలుపాలయ్యారు. దీంతో వీరిని బాతువ, జి.సిగడాం ఆరోగ్య కేంద్రాలకు తరలించి చికిత్స చేశారు. గ్రామంలో పిచ్చికుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని, నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



నారాయణ తిరుమలలో వేంకటేశ్వరునికి పూజలు



మొండేటివీధిలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



దూదివారి కోవెలలో తులసీమాలల అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్థానిక గుజరాతీపేటలోని ఉత్తరాంధ్ర తిరుమల కొండగా పేరొందిన నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో స్వామివారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు అర్చనలు చేయించారు. శ్రీవేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేపట్టారు. అలాగే మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలు జరిగాయి. స్వామివారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి. స్థానిక చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని పూలమాలలతో అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం: 9951602845, 9951602849, 9912220367, 9705444191, 9010299083
ఎచ్చెర్ల: 9951602849
Office mail : sklmadvt@gmail.com